

త్రివర్ణ రంగులతో ముస్తాబైన మెదక్ కోట


నమస్తే తెలంగాణ

సిద్దిపేట

I | హైదరాబాద్, ఆదివారం 2 జూన్ 2024 | SIDDIPET




విద్యుత్ కాంతులతో ముస్తాబైన సంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణం



శనివారం రాత్రి హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్



హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుతో పాటు జిల్లా నాయకులు



హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీలో నినదిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీకి హాజరైన అశేష జనం

# రాష్ట్ర సాధనలో మెతుకుసీమ కీలక పాత్ర

## కేసీఆర్ వెంట కదిలిన సబ్బండవర్గాలు.. 42 రోజుల పాటు సకల జనుల సమ్మె







తెలంగాణ మలిదశ ఉద్యమంలో సిద్దిపేట రంగధాంపల్లి వద్ద కేసీఆర్ ఆమరణ దీక్షా స్థలి వద్ద హరీశ్‌రావు, ఇతర పార్టీల నేతలు (ఫైల్)

- **రంగధాంపల్లి దీక్షా శిబిరంతో ఉద్యమం ఉధృతం**
- **సిద్దిపేట, పాలమాకులలో రిలే నిరాహార దీక్షలు**
- **హరీశ్‌రావు నేతృత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో 132 కి.మీ. పాదయాత్ర**
- **తెలంగాణ వచ్చాక కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధి**

సిద్దిపేట, జూన్ 1( నమస్తేతెలంగాణ ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సాధనలో మెతుకుసీమ కీలకపాత్ర పోషించింది. ఉద్యమానికి ఊపిర్లూది రాష్ట్రం సిద్ధించే వరకు సబ్బండ వర్గాలు కేసీఆర్ వెంట నడిచాయి. అన్ని రంగాలు అభివృద్ధి సాధించాలంటే కేసీఆర్‌తోనే సాధ్యమని రాష్ట్రాన్ని కేసీఆర్ చేతిలో పెట్టారు. కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లలో ఎంతో అభివృద్ధి సాధించింది. తెలంగాణ ఉద్యమ రథసారథి కేసీఆర్ సిద్దిపేట రంగధాంపల్లి ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది. రాష్ట్ర సాధనలో సబ్బండ వర్గాల ప్రజలు పాల్గొన్నారు. నల్లబ్యాడ్జిలతో నిరసన కార్యక్రమాలు, సకల జనుల భేరి, సడక్ బంద్, జైలుభరో తదితర కార్యక్రమాలకు జిల్లా వేదికైంది. సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటు నంగునూరు మండలం పాలమాకులలో రిలే నిరాహార దీక్షలు జరిగాయి. పాలమాకులలో వెయ్యి రోజుల పాటు దీక్షలు జరగ్గా, సిద్దిపేటలోని పాత బస్టాండ్ (మాడ్రన్ బస్టాండ్) వద్ద దీక్షలు జరిగాయి. చరిత్రలో ఎక్కడా జరగని విధంగా రాష్ట్ర సాధన కోసం 42 రోజుల పాటు చేపట్టిన సకల జనుల సమ్మెతో పాలన స్థంభించింది. ఆమరణ నిరాహార దీక్షకు కేసీఆర్ కరీంనగర్ నుంచి బయలుదేరి సిద్దిపేట దీక్షా స్థలానికి చేరుకుంటున్న క్రమంలో పోలీసులు అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించడంతో సిద్దిపేట ఆమరణ నిరాహార దీక్ష స్థలిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.14ఎఫ్ రగడ.. తెలంగాణ ఉద్యమ దశను దిశను మార్చి ఉద్యమానికి నాంది పలికి ఒక ప్రభంజనంలా సృష్టించింది.

### హింసకు తావు లేకుండా ఉద్యమం

హింసకు తావులేకుండా, శాంతియుతంగా, గాంధేయ మార్గంలో పోరాడి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు జనాన్ని కదిలించి, ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన ధీరుడు కేసీఆర్. ఆనాటి ఉద్యమ సమయంలో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు ఇప్పటికీ జనాల హృదయాల్లో పదిలంగా ఉన్నాయి. కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష, హైదరాబాద్ నగరాన్ని ఆరో జోన్ నుంచి వేరుచేస్తూ ఫ్రీజోన్‌గా మార్చేందుకు తీసుకున్న నేపథ్యంలో కేసీఆర్ తీసుకున్న 14ఎఫ్ రగడ సంచలన నిర్ణయానికి నాంది పలికింది. అరవై ఏండ్లలో తెలంగాణ ప్రజలు అణిచివేతకు గురవుతున్న పరంపరలో ఫ్రీజోన్ వివాదం చిలికిచిలికి గాలివానగా మారి ఉద్యోగులందరినీ ఏకతాటిపైకి తెచ్చింది. ఉద్యమాల పురిటిగడ్డ సిద్దిపేటలో ఫ్రీజోన్.. కాదురా.. హైదరాబాద్ మాదిరా.. పేరిట 14ఎఫ్‌కు వ్యతిరేకంగానిర్వహించిన ఉద్యోగ గర్జన భారీ బహిరంగ సభ కేసీఆర్ సంచలన నిర్ణయానికి వేదికైంది. తెలంగాణ ఉద్యమానికి దిక్సూచి అయిన సిద్దిపేటలో తాను దీక్ష చేపడుతున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. ఉద్యమ సారథి కేసీఆర్ ప్రకటనలతో జాతీయ, రాష్ట్రస్థాయిలో పెను సంచలనాలను సృష్టించాయి. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు, పెను మార్పులు ఎన్నో కీలక ఘట్టాలు ఆవిష్కరించాయి. హైదరాబాద్‌తో కూడిన పది జిల్లాల తెలంగాణ సాధించేంత వరకు అదే స్ఫూర్తితో వేలాది మంది విద్యార్థులు ఆత్మబలిదానాలకు పాల్పడి తెగించి కొట్లాడి తెలంగాణ వాదాన్ని బలపరుస్తూ అదే పంథాను కొనసాగించారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం యూపీఏ పరిణామాలు, ఉత్కంఠల నడుమ అఖిలపక్ష తీర్మానాలు చేయించి లోక్‌సభలో ఫిబ్రవరి 18న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. రాజ్యసభలో ఫిబ్రవరి 20న హైదరాబాద్‌తో కూడిన పది జిల్లాల తెలంగాణకు ఆమోద ముద్ర వేశారు. ఈమేరకు మార్చి 1న రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు రాజముద్ర వేశారు. తదనంతరం తెలంగాణలో జరిగిన సాధారణ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తెలంగాణ ప్రజలు పట్టం కట్టారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించడంతో అదేరోజు తెలంగాణ ఉద్యమ రథ సారథి, తొలి తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రమాణ స్వీకారం చేశారు.

### ఉద్యమ ఘట్టాల్లో కొన్ని...

ఉద్యమంలో బీఆర్‌ఎస్ ఒడిదుడుకులు, ఆటుపోట్లను ఎదుర్కొని ఉద్యమ ఉధృతి ఏ మాత్రం తగ్గకుండా ముందుకు తీసుకెళ్లి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి చరిత్రలో ఒక మైలురాయిగా నిల్చింది. 2005లో వరంగల్‌లో నిర్వహించిన జైత్రయాత్ర సభకు సైకిల్‌పై బయలుదేరిన కేసీఆర్ వెంట సైకిళ్లపై వందల మంది కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. 2006లో తెలంగాణ విషయంలో కాంగ్రెస్ పార్టీ మాటతప్పడంతో ఆ పార్టీపై కేసీఆర్ యుద్ధం ప్రకటించారు. సిద్దిపేటలో శంఖారావం పేరిట బహిరంగ సభ నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి లక్షల్లో ప్రజలు హాజరై మద్దతు తెలిపారు. తెలంగాణ కోసం మహాధర్నా పేరిట రాజీవ్ రహదారిని దిగ్బంధం చేశారు. సిద్దిపేట శివారులోని రాజీవ్ రహదారిపై జరిగిన కార్యక్రమానికి కేసీఆర్ హాజరయ్యారు. 2008లో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించిన తర్వాత కాంగ్రెస్ నాయకులకు సవాల్ చేస్తూ సిద్దిపేటలో హరీశ్‌రావు నాయకత్వంలో నిర్వహించిన ఉద్యోగ గర్జనకు భారీ స్పందన లభించింది. 2009 నవంబర్‌లో సిద్దిపేటలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న కేసీఆర్ తెలంగాణ వాలె జాగో.. ఆంధ్రా వాలె బాగో.. నినాదమిచ్చారు. ఆ తర్వాత నవంబర్ 9న పాపన్నపేట మండలంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములపై పద్మాదేవేందర్‌రెడ్డి, దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి ఆందోళనకు దిగారు. హరీశ్‌రావు, కేటీఆర్ తదితరులంతా పాల్గొని ఆందోళన ఉధృతం చేశారు. హైదరాబాద్ ఫ్రీ జోన్ అంటూ సుప్రీం కోర్టు తీర్పునివ్వడంతో తెలంగాణ ఉద్యమం ఊపందుకుంది. ఫ్రీ జోన్ రద్దుకు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో కేసీఆర్ ఆమరణ దీక్షకు నిర్ణయించారు.

**కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లలో ఎంతో ప్రగతి**

కేసీఆర్ నాయకత్వంలో మెతుకుసీమ ఎంతో అభివృద్ధి సాధించింది. పదేండ్లలో రూపురేఖలు మారాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు కాళేశ్వరంతో గోదావరి జలాలను మెతుకుసీమకు తరలించారు. తెలంగాణ రాష్ట్రం అవతరణ తర్వాత జిల్లాలు ఏర్పాటు చేసుకున్నాం. రెవెన్యూ డివిజన్లు, కొత్త మండలాలు, కొత్త గ్రామాలను ఏర్పాటు చేసుకున్నాం. పాలనాపరమైన సంస్కరణలతో ప్రజాప్రయోజనాలకు మరింత ఊతమిచ్చినట్లయింది. సువిశాలమైన కలెక్టరేట్లు, పోలీస్ కమిషనరేట్లు నిర్మించుకున్నాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాక ముందు జిల్లాలో ఒక్క నీటిపారుదల ప్రాజెక్టు కూడా లేదు. చెరువులు అధ్వాన్నంగా కనిపించేవి. వాగులు, చెక్‌డ్యాంలను పట్టించుకున్నవాళ్లే లేరు. రంగనాయకసాగర్, కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండ పోచమ్మసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్లను అద్భుతంగా నిర్మించుకున్నాం. మిషన్ కాకతీయతో చెరువులను అభివృద్ధి చేసుకొని గోదావరి జలాలతో నింపుకున్నాం. ఆనాడు వానకాలంలో కూడా గుక్కెడు నీటికి కటకట ఎదుర్కొన్న ప్రాంతాల్లో నేడు మండుటెండల్లో మత్తళ్లు దుంకుతున్నాయంటే అతిశయోక్తి కాదు. తాగునీటి కష్టాలు తీరాయి. కులవృత్తులను ప్రోత్సహించి, వారు స్వయం సమృద్ధి సాధించేలా అనేక పథకాలను కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పారిశ్రామిక రంగానికి ఊతమిచ్చింది. రైతులకు నాణ్యమైన కరెంట్ ఇచ్చింది. పట్టణ ప్రగతి, పల్లె ప్రగతితో గ్రామాలు అద్భుతంగా తీర్చిదిద్దబడ్డాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన అభాగ్యులందరికీ ఆపన్నహస్తం అందించారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, బీడీ కార్మికులతో పాటుగా ఎయిడ్స్, ఫైలేరియా, డయాలసిస్ బాధితులను కూడా అక్కున చేర్చుకొని పింఛన్లు అందజేసిన ఘనత కేసీఆర్‌కు దక్కింది.

## రంగధాంపల్లి దీక్షా శిబిరం వేదిక

ఉద్యమ సారథి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు సిద్దిపేటను ఎంచుకోవడంతో తెలంగాణ వాదుల పిడికిలి బిగించారు. కేసీఆర్ దీక్షను సవాల్‌గా తీసుకున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, పద్మాదేవేందర్‌రెడ్డి, దివంగత నేత సోలిపేట రామలింగారెడ్డితో కలిసి రంగధాంపల్లి అమరవీరుల స్థూపం సమీపంలో దీక్షా శిబిరం వేదిక ఏర్పాట్లను ముమ్మరం చేశారు. వేలాదిగా తరలివచ్చే ఉద్యమకారులు కూర్చునేందుకు వీలుగా విశాలమైన ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. ఆమరణ దీక్షకు బయలుదేరిన కేసీఆర్‌ను నవంబర్ 29న కరీంనగర్ శివారులో పోలీసులు అరెస్టు చేసి ఖమ్మం తరలించగా సిద్దిపేట దీక్షాస్థలి వద్ద హరీశ్‌రావు, పద్మాదేవేందర్‌రెడ్డి, దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి తదితర నాయకులు దీక్షకు సిద్ధమయ్యారు. దీక్షా స్థలిని పోలీసులు అణిచివేయడంతో ఉద్యమం ఉధృతమైంది. ఒకవైపు కేసీఆర్‌ను ఖమ్మం జైలుకు తరలించడంతో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు ఉద్యమబాట పట్టారు. దీంతో జిల్లా విద్యార్థి లోకం లేచింది. జిల్లా విద్యార్థి విభాగం నాయకులు విద్యార్థులను చైతన్యపర్చేందుకు విస్తృతంగా విద్యార్థి గర్జన పేరిట సదస్సులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో ఉద్యమంలో భాగంగా జాతీయ రహదారిపై ధర్నాలు, రైలురోకోలు, రోడ్లపై వంటావార్పు, రోడ్ల దిగ్బంధం తదితర కార్యక్రమాలు ఉధృతంగా నిర్వహించారు. 42 రోజులపాటు జరిగిన సకల జనుల సమ్మెలో బీఆర్‌ఎస్ పార్టీ కీలక పాత్ర పోషించింది. హరీశ్‌రావు నేతృత్వంలో ఉమ్మడి జిల్లాలో 132 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు.



రంగధాంపల్లి దీక్షా స్థలి వద్ద భారీగా మోహరించిన పోలీసులు (ఫైల్)

# తెలంగాణ దేశానికే ఆదర్శం

- **దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే..**
- **బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**
- **నేడు బీఆర్‌ఎస్ జెండాలు, జాతీయ జెండాల ఆవిష్కరణ**



మెదక్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ముగింపు వేడుకలు నిర్వహించాలని బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ తెలంగాణ సాధించి... స్వరాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజల సహకారంతో దశాబ్దకాలంపాటు ప్రగతిని సాధించి దేశానికే ఆదర్శంగా తెలంగాణను నిలిపిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు దశాబ్ది ముగింపు వేడులను మెదక్ జిల్లాలో ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కార్యకర్తలు, పార్టీ అందించే సూచనలను అనుసరించి ముగింపు వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావమై దశాబ్ది కాలం గడుస్తున్న నేపథ్యంలో దశాబ్ది ముగింపును తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరుగనున్నది. కార్యక్రమానికి మెదక్ జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలన్నారు. జూన్ 3న మెదక్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో.. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను, జాతీయ జెండాను ఆవిష్కరిస్తామని, అనంతరం జిల్లాల్లోని పలు దవాఖానల్లో, అనాథ శరణాలయాల్లో స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తామని చెప్పారు.

# పరస్పర సహకారానికి ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న వీసి నీరజాప్రభాకర్, అధికారులు

ములుగు, జూన్ 1: ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఐసీఎమ్ఆర్–ఎన్ఐఎన్) సంస్థల మధ్య పరస్పర సహకారానికి శనివారం అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నీరజాప్రభాకర్ ఆధ్వర్యంలో అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. క్లిష్టమైన ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు ప్రజారోగ్య వ్యవస్థను మెరుగుపర్చేందుకు, స్థిరమైన ఉద్యాన పంటలను ప్రోత్సహించడంలో ఈ ఒప్పందం దోహదపడుతుందని వీసీ నీరజాప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భగవాన్, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ కిరణ్‌కుమార్, డీన్ రాజశేఖర్, శాస్త్రవేత్త సుచిత్ర ఇతర అధికారులు ఉన్నారు.

# సిద్ధప్ప వరకవి స్ఫూర్తితోనే అందెశ్రీ రచనలు



సిద్ధప్ప వరకవి ఆశ్రమాన్ని సందర్శించినప్పుడు సిద్ధప్ప సాహిత్యాన్ని అందెశ్రీకి వివరిస్తున్న మాణిక్యలింగం

- **అందెశ్రీ రాసిన పాట రాష్ట్రగీతంగా ఎంపిక కావడం హర్షణీయం**
- **ప్రముఖ కవి, రచయిత, సిద్ధప్ప వరకవి కుమారుడు మాణిక్యలింగం**

హుస్నాబాద్, జూన్ 1: గోల్కొండ ఆస్థాన కవిగా, రాజయోగిగా ప్రఖ్యాతిగాంచిన సిద్ధప్ప వరకవి సాహిత్యం స్ఫూర్తితోనే అందెశ్రీ రచనలు ఉంటాయని ప్రముఖ కవి, రచయిత, సిద్ధప్ప వరకవి కుమారుడు అనంతవరం మాణిక్యలింగం తెలిపారు. సిద్ధప్ప వరకవి సాహిత్యం కోసం పలుమార్లు అందెశ్రీ గుండారెడ్డిపల్లికి వచ్చి ఆయన అనుభవాలను, రచనలను తనతో పంచుకున్నట్లు చెప్పారు. అందెశ్రీ సాహితీవేత్తగా, కవిగా ఎదగానికి సిద్ధప్ప వరకవి రాసిన పద్యాలు, రచనలు కారణమని చెప్పేవారన్నారు. చిన్నతనంలో పశువుల కాపరిగా ఉన్న సమయంలో సిద్ధప్ప రాసిన జ్ఞానబోధినిలోని పద్యాలను, పంక్తులను, అక్షరాల కూర్పును చదివి అదే పంథాలో అందెశ్రీ కూడా పద్యాలు రాశారని తెలిపారు. తన సాహిత్యానికి, రచనలకు సిద్ధప్ప వరకవియే స్ఫూర్తి అని ఇటీవల టీవీ చానళ్లు, పత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లోనూ ఆయన స్వయంగా చెప్పారన్నారు. తన తండ్రి సిద్ధప్ప వరకవి స్ఫూర్తితో కవిగా, రచయితగా ఎదిగిన అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గీతం రాష్ట్ర గీతంగా ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఆయన మరిన్ని రచనలు చేసి జాతీయ స్థాయిలోనూ గుర్తింపును తెచ్చుకోవాలని కోరుకుంటున్నట్లు మాణిక్యలింగం తెలిపారు. ఈ పాట తెలంగాణ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


- **సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి**

వట్‌పల్లి, జూన్ 1: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఫర్టిలైజర్ దుకాణదారులను హెచ్చరించారు. శనివారం సంగారెడ్డి జిల్లా వట్‌పల్లిలోని ఖాదిరాబాద్‌లో ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ అధికారులుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, ప్రతి దుకాణంలో ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. కాలపరిమితి చెల్లిన విత్తనాలు, ఎరువులు విక్రయించినా, అధికధరలకు విక్రయించినా లైసెన్స్‌లు రద్దు చేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తామన్నారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ రసీదు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు వాటిల్లకుండా త్వరగా కొనుగోళ్లు పూర్తి చేయలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, ఏవో మహేశ్‌చౌహన్, ఏఈవో పరిమళ, రైతులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ డీసీసీబీ సేవలు

## నెల రోజుల పాటు ఇంటింటికి స్పెషల్ డ్రైవ్

- **ఐదేండ్లలో డిపాజిట్‌పై డబుల్ చెల్లింపులు**
- **ఖాతాదారులకు ఏడాది వరకు ఉచిత బీమా సౌకర్యం**
- **డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి**



డిపాజిట్ల సేకరణ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిట్టి దేవేందర్‌రెడ్డి, అధికారులు

సంగారెడ్డి, జూన్ 1 : ఖాతాదారులకు కొత్త పథకాలను అందించేందుకు సంగారెడ్డి జిల్లాలో ఇంటింటికీ డీసీసీబీ కార్యక్రమాన్ని చేపట్టామని, నెల రోజుల్లో ఐదు లక్షల ఖాతాల నమోదుకు శ్రీకారం చుట్టామని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో సీఈవో శ్రీనివాస్‌తో కలిసి డిపాజిట్ల సేకరణ పథకం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఖాతాదారులకు డీసీసీబీ ఉత్తమ సేవలు అందిస్తూ తొలిస్థానంలో నిల్చిందని, నూతన పథకాలను ప్రవేశపెట్టి ఖాతాల నమోదుకు బ్యాంకు సిబ్బంది, అధికారులు ఇంటింటికెళ్లి డీసీసీబీ సేవలను వివరించి కొత్త ఖాతాలు తెరిపించాలన్నారు. ఖాతాలు తీసుకున్న వారికి ఏడాదిపాటు ఉచిత బీమా సౌకర్యం కల్పించామని చెప్పారు. డిపాజిట్లపై ఐదేండ్లలో డబుల్ డబ్బులు తిరిగి చెల్లిస్తామని, ఇందులో చిన్నారులకు బచ్‌పన్ భరోసా పథకం, లక్షాధికారి పథకం, బంగారు ఆభరణాలపై రూ.20లక్షల వరకు రుణాలు పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఖాతాదారులు ఉచిత బీమా పథకాన్ని పొందేందుకు కేవలం బ్యాంకులో ఖాతా తీసుకుంటే సరిపోతుందని, ఏడాది అనంతరం తిరిగి బీమా పథకాన్ని పొడిగించుకోవాలన్నారు. డీసీసీబీ అందించే సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో జీఎం పురుషోత్తంరావు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.